పెళ్ళి విషయంలో
మౌనంగావున్న
తన ప్రేమికుణ్ణి
ఆమె ఎలా
అర్థం చేసుకుంది?

మల్లాది
వెంకట కృష్ణమూర్తి
కథ

# ఎదురుగాలి

నవల ఆఖరి పేజీ చదవడం పూర్తిచేసి దీర్ఘంగా నిట్టూర్చింది షీలా. ఆ పేజీలోని నవల ఆఖరి వాక్యాన్ని మరోసారి చదివింది పుస్తకాన్ని టేబిల్ మీద వుంచింది.

అర్థరాత్రి పదకొండున్నర అవటం వల్ల ఎదురుగా అల్మైరాలోని టైంపీస్ టిక్‌టిక్ చప్పుడు తప్ప, ప్రశాంతంగా వుంది. లేచి స్టీల్‌జగ్గులోని నీళ్ళని గ్లాసులోకి వంచుకుని తాగి మంచంమీద పడుకుంది.

పావుగంట కళ్ళుమూసుకుని అలాగేపడుకుంది షీలా నిద్రపట్టలేదు. లేచి ఆ నవల మళ్ళీ అందుకుంది. నవలతెరచి లోపల ఏభై నంబర్ పేజీలో వుంచిన కవరు బయటికి తీసింది. ఆ కవరు ఇదివరకే చింపబడి వుంది. ఆ వుత్తరంతీసి మళ్ళీ చదివింది.

స్వీట్ షీలా.

రేపు ఎల్లుండి సెకండ్ సాటర్‌డే, సన్‌డే. వస్తావు కదూ?

నీ
లక్ష్మీపతి.

కవరులో పెట్టింది ఆ వుత్తరాన్ని మడిచి. నవలతెరచి ఏభై నంబర్ పేజీ వెదకి అందులో పెట్టింది ఆ వుత్తరాన్ని మళ్ళీ.


మరో గ్లాస్ మంచినీళ్ళు జగ్‌లోంచివంచుకుని తాగి పడుకుంది. ఆలోచనలతో మరో పావుగంట గడిచినా నిద్రరాలేదు.

సీలింగ్ వంక చూస్తూ పడుకుంది షీలా.

* * *

"బావుందా?" అడిగాడు లక్ష్మీపతి.

"ఏమిటి?"



"షీలా ఏమిటి ఇవాళ ఒంట్లో బాగా లేదా ?"

"బాగేవుంది ఏం ?"

"అదోలా వున్నావు"

నీకొత్త బూట్లేనా, బావున్నాయి" మంచంమీద పడుకొనవున్న షీలా, తలుపు ప్రక్కనున్న బూట్లవంక చూసి చెప్పింది.

"ఇవాళ హుషారుగాలేవు ఏమైంది ? మివాళ్లు నీకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా ?" నవ్వాడు.

"మన పెళ్ళిమాటేమిటి ?"

లక్ష్మీపతి షీలా మొహంలోకిచూసాడు.

"నేను చేసుకోనని అపనమ్మకమా ?"

"చేసుకోవటం ఎప్పటికైనా తప్పని సరికాబట్టి అదేదో ఆలస్యం చేయకుండా వెంటనే చేసుకోవటం మంచిదని నా అభి

ప్రాయం"

"నేను చెప్పాగా మా అక్కయ్యకింకా సంబంధం కుదరలేదని"

"సంవత్సరం నుంచి వెదుకుతున్నా కుదరలేదు ఇంకో సంవత్సరం ఆగినా కుదురుతుందని నమ్మకం ఏమిటి ?"

షీలాని మరింత మీదకి లాక్కున్నాడు లక్ష్మీపతి

"అందరూ నీలా అదృష్టవంతులుగా పుడితే ఎలా ?"

"మనం త్వరపడటం వుత్తమం"

"అక్కయకి కాకుండానే చేసుకుంటే పెద్దలు బంధువులు నవ్వరూ ?"

షీలా జవాబు చెప్పలేదు

"నేను నిన్ను మోసం చేస్తానని భయమా ?"

షీలా మౌనంగా వుండిపోయింది.

లక్ష్మీపతి మంచం కింద వున్న సిగరెట్ పెట్టె అందుకున్నాడు

"కాల్చొద్దు" అన్నది షీల చిరాకుగా.

సిగరెట్ పెట్టెని వదలేసి షీలాని మీదకి లాక్కున్నాడు

* * *

"చేసుకోండి" అన్నాడు బట్టల దుకాణం అతను టెలిఫోన్‌ని షీలావైపు జరుపుతూ షీలా మోహంలోని ఆందోళనని పసికట్టాడతను.

రిసీవర్ అందుకుని ఓ నంబర్ తిప్పింది షీలా వణకుతున్న వేళ్ళతో.

రిసెప్షనిస్ట్ కంఠం వినబడింది అవతల నుంచి

"ప్లీజ్ కనెక్ట్ మి టు బడ్జెట్ సెక్షన్"

కొన్ని క్షణాల తర్వాత ఓ మొగ గొంతు వినబడింది.

"జడ్జెస్"

"కెన్ ఐ స్పీక్ టు మిస్టర్ లక్ష్మీపతి"

"జస్ట్ ఎ సెకండ్"

షీలా ఆదుర్దాగా ఓసారి తనొచ్చిన ఆటోవంక చూసింది. డ్రయివర్ బీడీ తాగుతున్నాడు రోడ్డుమీది ట్రాఫిక్ వంక చూస్తూ.

"లక్ష్మీపతి హియర్"

"హలో నేను షీలాని ఇవాళ ఆఫీస్‌లో వున్నావో శెలవ పెట్టావో తెలియక భయపడి చస్తున్నాను. నీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి"

"చెప్పు"

ఓ చెవి ఇటు పారేసి దొంగతనంగా తన మాటలు వింటున్న బట్టల దుకాణం సేల్స్‌మెన్ వంక ఓరగా చూసి చెప్పింది షీలా.

"ముఖాముఖీ మాట్లాడాల్సిన సంగతది"

"సాయంత్రం రూమ్‌కి వస్తావా ?"

"కాదు నేను మీ ఆఫీస్‌కి వస్తున్నాను ఆటో వెయిట్ చేస్తోంది రోడ్డుమీద"

"అంత అర్జెంటా ?"

"అవును"

కొన్ని క్షణాలతర్వాత వినిపించింది లక్ష్మీపతి కంఠం

"శెలవు పెట్టాలా నేను ?"

"ఏమో బహుశా పెట్టాల్సివస్తుంది"

"నువ్విక్కడికి వచ్చాక ఆలోచిద్దాం ఆ సంగతి. రిసెప్షనిస్ట్‌తో చెప్పి వుంచుతాను. నీ పేరు చెప్పు రిసెప్షనిస్ట్‌కి. నువ్వు రాగానే నాకు కబురుచేస్తుంది. అక్కడే విజిటర్స్ చెయిర్స్ వుంటాయి కూర్చో"

"ఐయవేర్దరుతున్నాను"

"ఓ పావుగంటలో ఇక్కడ వుంటావు బై దెన్"

ఫోన్ని షీలా క్రేడిల్ మీద వుంచేలోగా రిసీవర్ లోంచి ఇంకా మాటలు వినబడటంతో మళ్ళీ చెవిదగ్గరుంచుకుంది.

"ఇక్కడ విషయినంత ప్రశాంతంగా నువు చెప్పదలుచుకున్నది చెప్పు చాలా మంది మనల్ని చూస్తుంటారు బావుండదు"

అటో పావుగంటలో చేరుకుంది లక్ష్మీపతి పనిచేసే కంపెనీ. ఫేర్ చెల్లించి నడిచింది రిసెప్షన్ గదిలోకి. అప్పటికే లక్ష్మీపతి విజిటర్స్ చెయిర్‌లో కూర్చుని పేపర్ చూస్తున్నాడు షీలా అతని ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చుంది.

"ఏమిటి సంగతి!" అడిగాడు

"ఆ మధ్య హైదరాబాద్ నుంచి ఎవరో వచ్చి నన్ను చూసి వెళ్ళాడని చెప్పాను గుర్తుందా?"

"యస్. ఏ జి ఆఫీసులో అతనా?"

"కాదు ఏదో ప్రయివేట్ కంపెనీ. గుర్తులేదు"

"నువు నచ్చావా అతనికి?"

"ఉదయం మా నాన్నగారికి వుత్తరం వచ్చింది, ముహూర్తం నిర్ణయం చేసుకో డానికి వాళ్ళ నాన్నగారి వూరు వెళ్ళచ్చని"

"కంగ్రాచ్యులేషన్స్"

"డామిట్ నవ్వుతావే ఇందులో హాస్యం ఏముంది?"

"ఒకసారి సీరియస్‌నెస్‌లోంచి కూడా నవ్వు పుట్టుకొస్తూంటుంది"

"మా నాన్నగారు కొత్తవరం వెళ్తున్నారు రాత్రికి"

"నువు చెప్పలేదా నాకిష్టం లేదని?"

"ఎలా చెప్పను? చెప్పినా నా మాట వింటారా? 'మెట్రిక్ పేసవలేకపోయావు. ఇంతకంటె మంచి సంబంధం నే తీసుకురాలేనమ్మాయ్' అంటారాయన"



## తిండిపోతులం !

అవునండీ... మనమంతా తిండిపోతులమే ! ప్రతి రోజూ ఉదయం కాఫీ టిఫెనూ లాగిస్తాం ! ఆ తర్వాత భోజనం-మధ్యాహ్నం మళ్ళీ టిఫెనూ. టీ రాత్రి ఇంకో సారి భోజనం-ఆ మధ్యలో ఎన్నోసార్లు కాఫీ...టీలు ! ఈ లెక్కన నెలకు మనమెంత తింటామో లెక్కకట్టండి. అలాగే సంవత్సరానికి... పది సంవత్సరాలకు... అరవై సంవత్సరాలకు... ఎంత ఆహారాన్ని తింటామో ఆలోచించి చూడండి ! చాలా కష్టమైన లెక్క అంటారా ? చెప్పడం కష్టమే పరిశోధనలో తేలిన వివరాలనుబట్టి సగటున మనం మన జీవితకాలంలో పదిహేను టన్నుల ఆహార పదార్థాల్ని తింటాం ! కంగారు పడకండేం !

-జూపిటర్

"అలా లాన్‌లోకి వెళ్దాం పద" అన్నాడు లక్ష్మీపతి.

లేచి రిసెప్షనిస్ట్ ఫోన్ దగ్గరికి నడిచి వెళ్ళి, రిసీవర్ ఎత్తి మూడు నంబర్లు తిప్పి, అవతలి వాళ్ళకి ఏదో చెప్పి శీలా దగ్గరికి వచ్చాడు.

"లీవ్ పెట్టావా" అడిగింది.

"ఊహూ అరగంట పర్మిషన్"

ఇద్దరు గాజు తలుపు తెరచుకుని బయటకి నడిచారు పచ్చటి లాన్‌లోకి.

"కూర్చుందామా" అడిగాడు లక్ష్మీకాంత్

"ఏం చేస్తే బావుంటుంది?"

"నీకేం తట్టడం లేదా?"

"ఊహూ ఆలోచించాలి"

శీలా మాట్లాడలేదు. గడ్డిపరకలు పెరకసాగింది కుడిచేతి రెండు వేళ్ళతో.

"ఏం చేద్దాం" అడిగాడు లక్ష్మీపతి

"అదికూడా నేనే చెప్పాలా?"

"అంతే?"

"మనం చేయగలిగేది ఒకటే వుంది. వేరే మార్గంలేదు"

"ఏమిటది?"

"మా నాన్నగారితో మాట్లాడు"

"ఏమని?"

"మా నాన్నగారితో ఏం మాట్లాడాలో కూడా తెలియదా?" చిరాకుగా అడిగింది శీలా

"పెళ్ళి ఆపుచేయమనా?"

"నేనిప్పుడు ఒట్టిమనిషిని కాను"

"అంటే?"

"అంటావనుకున్నాను ఆ మాట. నాకు నెల తప్పింది"

లక్ష్మీపతి నిశ్శబ్దంగా జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె బయటకి తీశాడు. వెలిగించి పొగ వదుల్తూ ఉండిపోయాడు ఏం మాట్లాడకుండా

"కాబట్టి నువ్వు మా నాన్నగారితో చెప్పు జరిగింది. ఆగమని, తర్వాత నన్ను చేసుకుంటానని చెప్పు"

"ఎలా తెలుసు నెల తప్పిందని?"

"రెండవ నెల నడుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో మూడో నెల మొదలవుతుంది" శీలా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తల వంచుకుంది, తన కన్నీళ్ళని లక్ష్మీపతి చూడకూడదని

బాధగా నవ్వి చెప్పాడు లక్ష్మీపతి.

"నీకు నెల తప్పిందని సంతోషంగా చెప్పగలిగేబదులు ఇలా ఏడుస్తూ చెప్పాల్సి రావటం మన దౌర్భాగ్యం"

శీలా ఏడుపుని కంట్రోల్ చేసుకోసాగింది.

"పెళ్ళయి వుంటే మనకి పెళ్ళయి వుంటే అందరిముందే నవ్వుతూ చెప్పేదానివి. కేవలం మూడుముళ్ళు, ఓ గజం పసుపుతాడు నా మెళ్ళో కట్టకపోవటం వల్ల ఎంత తేడా?"

"మా నాన్నగారిని కలిసి చెప్పాలి నువ్వు"

"ఓ సంవత్సరం ఆగాల్సివస్తే ఎలా?"

"అదే ఏం చేయాలో నాకు అంతు పట్టడంలేదు"

తల విదిలించి అన్నాడు లక్ష్మీపతి.

"నన్ను ఆలోచించుకోనీ! రేపు కలుద్దాం మళ్ళీ"

"పొద్దున్నే ఓ లేడీ డాక్టర్ దగ్గరికి వెళ్ళి, అక్కడనుంచి ఆటోలో నీ దగ్గరికి

వస్తూ మధ్యలో ఆగి ఫోన్ చేశాను అసలు ఆఫీసులో వున్నావో లేదో కనుక్కుందామని"

"నేను శెలవ పెడుతున్నాను మధ్యాహ్నం"

"అవసరంలేదు"

"నీ గురించి కాదు ఆఫీస్‌లో పని చేయలేను ఇక ఇవాళ. పోదాం పద"

"నేను ఇంటికెళ్ళిపోతాను"

ఇద్దరూ లేచారు

"రేపు ఉదయం ఫోన్ చేస్తాను మళ్ళీ"

"వద్దు సాయంత్రం రూమ్‌కి రా"

"రాను"

"అదేం ?"

"నాకిష్టంలేదు"

"అయితే ఎక్కడ కలుద్దాం ?"

"శివాజీ పార్కులో"

* * *

"రాత్రి నిద్రపోలేదా ?" అడిగింది శీలా లక్ష్మీపతి మొహంవంక చూసి.

"లేదు నిద్రపట్టలేదు"

గడ్డిని పీకసాగింది శీలా

చాలా సేపు ఇద్దరిమధ్యా మాటలేవు.

"ఏం ఆలోచించుకున్నావు?" అడిగింది శీలా.

"మీ నాన్నగారితో చెప్తే నా మాట నమ్మి అగుతారని నిశ్చయం ఏమిటి ?"


"ప్రయత్నించి చూడటంలో తప్పు లేదుగా"

"నీకు అబార్షన్ చేయించి పెళ్ళి చేయచ్చు మొదలు పంచి"

"ఊహేగా అది"

"నిజం వూహించానని ఎందు కనుకోవు?"

"భవిష్యత్‌లో జరిగేంజాలని వూహించే శక్తి నీకు నిజంగా వుంటే. మనం ఈ పరిస్థితిలో చిక్కుకొనే వాళ్ళం కాదు"



"మీ నాన్నగారు వప్పుకున్నా. మన పెళ్ళయేదాకా ఆగటం ఎలా? మన పెళ్ళి కాకుండానే పిల్లని కనడం... తర్వాత నిన్ను చేసుకొంటే నేను లోకుల దృష్టిలో వెధవ నవనా?"

"అంటే?"

చివుక్కున తలెత్తి చూసింది షీలా.

"నేను తిరుగుబో..."

"అగు నేననలేదు ఎన్నడూ అనను మాట ని మనసు నాకు తెలుసు కానిఅలా అనుకుంటారు ప్రజలు"

"కాబట్టి ఏ విధంగా ఆలోచించినా గర్భవిచ్ఛిత్తి తప్పదంటావు?"

"నా తాత్పర్యం అదికాదు మంచి దంటాను"

"మనం వెంటనే పెళ్ళి చేసుకుంటే?"

"మా అక్కయ్య?"

"నీకు మీ అక్క ముఖ్యమా! మనకి పుట్టబోయే బిడ్డ ముఖ్యమా?"

"ఒక్క మా అక్కే కాదు మిగతా చెల్లెళ్ళ పెళ్ళి సంగతి ఆలోచించక్కర్లేదా?"

లక్ష్మీపతి సిగరెట్ పేకెట్ జేబులోంచి తీయబోతూ కోపంగా అంది షీలా

"కాల్చకు"

లక్ష్మీపతి నిస్సహాయంగా చేతులని వళ్లో పడేసాడు

"అబార్షన్ అంటూ జరిగి తీరాలంటే అది ఇంట్లో తెలియకుండానే జరగాలి"

"నేనేర్పాటు చేస్తాను"

లక్ష్మీపతి కంఠంలోని బాధని గుర్తించింది షీలా.

"ఇంకోసారి ఆలోచించు. రేపు ఆఫీస్‌కి ఫోన్ చేస్తాను"

"నన్ను నీచంగా అనుకుంటున్నావా షీలా?"

"నేను వూహించని దెబ్బ'-అదే స్వార్థం-నీలో వుందని తెలుసుకొన్నానంతే స్వార్థం వుండటంలో దోషం లేదు"

"థాంక్స్"

"రేపు ఫోన్ చేస్తాను"

"ఈ విషయాలు మాట్లాడకు ఫోన్లో"

* * *

"షీలాని"

లక్ష్మీపతి కంఠం వినపడగానే చెప్పింది.

"కొత్త విశేషాలేమైనా వున్నాయా?"

"పాతవాటితోనే చస్తుంటే ఇంకా కొత్తవి ఎందుకు? వెంటనే ఓ గజం పసుపు తాడు నా మెడలో కట్టె ధైర్యంలేదా?"

"ఏమిటా పిచ్చి ప్రశ్న?"

"ఆల్‌రైట్. పిచ్చిప్రశ్నే. జవాబు చెప్పు"

"లేదు"

"అయితే హైదరాబాద్ సంబంధం ఖాయం"

"బెదిరింపా?"

"నేను నీకు కావాలో అక్కరలేదో చెప్పు"

"ఆ ప్రశ్న ఇప్పుడు నేనడగాలి"

"నా జవాబు. 'వద్దు'"

"షీలా"

తృళ్ళిపడ్డాడు లక్ష్మీకాంత్.

"అవును కేవలం నన్ను వాడుకునేందుకే కావాలి నేను నీకు భార్యగా అవసరంలేదు నేను"

"అంత పిచ్చిగా మాట్లాడకు"

"బహుశ భార్యలా కూడా కావాల్సి

రాసిచ్చు నాకు తెలియదు కాని నీకాబోయే భార్య చిక్కుల్లో వుంటే సహాయం చేయడం నీకు చేతకాదు"

"ఏమిటివాళ ఇలామాట్లాడుతున్నావు?"

"ఏప్రిల్ 27 న నా పెళ్ళి"

"మనం సాయంత్రం కలుద్దాం..."

"ఇక ఆ అవకాశం రాదనుకో కొత్తారం సంబంధం ఖాయం చేయడానికి మా నాన్నగారు వెళ్ళినమాట వాస్తవం ఆ సంగతి నీకు చెప్పాను. అయినా నా కోసం నువు ఏం చేయలేని పరిస్థితిలో వున్నావు నాకు నెల తప్పిందని తెలిసికూడా నీవు నా మా నాన నన్ను చావమని చేతులు ముడుచుకుని కూర్చున్నావు"

"ఫోన్‌లోనా ఇలా మాట్లాడేది?"

"ప్రేమ పేరుతో నన్ను వాడుకుంటు న్నావు అంతే నన్ను నమ్మించే ప్రయత్నం చేయక. నీకు మనస్ఫూర్తిగా నన్ను వివాహం చేసుకునే కోరికవుంటే ఏదయినా దారి ఆలోచించేవాడివి. మా ఇంటికి వచ్చి నాన్నగారితో మాట్లాడు రేపు సాయంత్రం. అందరం ఆలోచించి ఏంచేయాలో నిర్ణయించుకుందాం"

"........"

"ఏం మాట్లాడవేం?"

పకపక నవ్వింది షీలా.

"ఏమిటా నవ్వు!"

"ఒకోసారి సీరియస్‌నెస్‌లోంచి కూడా నవ్వు పుట్టుకొస్తుంటుంది" ఫోన్ పెట్టేసింది షీలా.

"ఒసారి అయోమయంగా చూసాడు లక్ష్మీపతి రిసీవర్ వంక. రెస్ట్ మీదుంచాడు దాన్ని.

అర్ధరాత్రి షీలా మనసు ఎంతో తేలికగా వుంది.

మరో పదిహేడు రోజుల్లో తన పెళ్ళి అయిపోతుంది లక్ష్మీపతిని మనసులోంచి నెట్టెయ్యం తేలికవుతుంది చోటు మారగానే.

బల్లమీద నవల అందుకుంది.

అందులోని ఆఖరి పేజీలోని ఆఖరి వాక్యం చదివింది.

"మోసపోయింది"

## ప్రకటన



ఓ పత్రికలో ప్రకటన ఇలా వుంది.

"నిన్న అర్ధరాత్రినుండీ మా మంత్రివర్గ సభ్యుల్లో ఒకరు కనిపించుట లేదు బహుశా మనుషుల్లో కలిసిపోయారేమో అనుమానంగా వుంది. తప్పిపోయినప్పుడు మెడలో మాల, ఒంటిపై కాషాయదుస్తులు వున్నాయి అమాకీ తెలిపిన వారికి బహుమతి లభిస్తుంది" అని

—కె వి. సత్యనారాయణమూర్తి (కొండసముద్రం)

ఆ నవలలోని హీరోయిన్ పెళ్ళి కాకుండా గర్భవతై, పడరాని పాట్లు పడింది. నవల మొత్తం ఆ కష్టాలే. ఆ నవల చదువుతూంటే షీలాకి గుండెలో రైళ్ళు పరిగెత్తాయి. ఆడదానికి కన్నెగా గర్భవతయితే ఎన్నికష్టాలు వస్తాయో అవగతం అయినవి.

నవలలో ఓ చోట. హీరోయిన్‌తో అంటుంది హీరోయిన్ చెల్లెలు.

"అక్కా మగాళ్ళు మంచివాళ్ళే. కాని పెళ్ళిదగ్గర మాత్రం వాళ్ళకి ఎక్కడిలేని స్వార్థం వస్తుంది ఆ సంగతి అనుభవ పూర్వకంగా తెల్సుకోక మునుపు, ఒక్క సారి. నువ్వు ఒక్కసారి ఆయనతో "నాకు నెల తప్పింది పెళ్ళి చేసుకో" అని అబద్ధం ఆడివుంటే ఆయనలోని స్వార్థం బయట పడేది. నువ్విలా ఇంట్లోంచి పారిపోవాల్సిన అవస్థ వచ్చి వుండేది కాదు పెళ్ళికిముందు శరీర సంపర్కం ఎదురుగాలిలా చీదర కలిగిస్తుంది"

ఆ పేజీలోంచి లక్ష్మీపతి వ్రాసిన ఉత్తరం వున్న కవరుని తీసి ముక్కలు ముక్కలుగా చించి దాన్ని కిటికీ లోంచి బయటికి విసిరేసింది షీలా

స్టీల్ జగ్‌లోంచి మంచి నీళ్ళు గ్లాసులోకి వంచుకుని త్రాగి పడుకుంది.

చాలా సేపు నిద్రపట్టలేదు

హఠాత్తుగా బిగ్గరగా నవ్వసాగిందు. శిక్షయిపేజీలోని ఆ వాక్యాలని గుర్తు తెచ్చుకుని ఆప్యాయంగా ఆ నవలని తన గుండె లకి హత్తుకుంటూ.

* * *

షీలా మోసపోలేదు

---

ఇదే ఒకే ఆలోచన, ఒకే మూడి సరుకు ఇద్దరి రచయితలకి వచ్చి ఒకరికి తెలియకుండా మరొకరు దాన్ని కథగా రాసి పత్రికలకి పంపటం జరుగు తుంటుంది. మీ అభిమాన రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి రాసిన ఈ కథ ఒక మాసపత్రికకి 1977 మార్చిలో పంపారు ఇదే థీమ్ తో రచయిత్రి శ్రీమతి ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి పంపిన కథని ప్రచురించి మల్లాది కథని ఆ సంగతి తెలియచేస్తూ ఆ ఎడిటర్ రిటర్న్ చేసారు ఏడేళ్ళ తర్వాత ప్రచురించిన ఆ కథే 'ఎదురు గాలి' —ఎడిటర్